క్లుప్తంగా

నేటి నుంచి దసరా సెలవులు

కొత్తపల్లి: మండలంలోని అన్ని పాఠశాలలకు ప్రభుత్వం శనివారం నుంచి దసరా సెలవులు ప్రకటించినట్లు మండల విద్యాధికారి శ్రీరాములు శుక్రవారం తెలిపారు. 25న పాఠశాలలు పునఃప్రారంభమవుతాయన్నారు. సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలను హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి తక్షణ సాయం



తక్షణ సాయం అందజేస్తున్న సర్పంచ్

జూపాడుబంగ్లా: మండలంలోని పోతులపాడు గ్రామానికి చెందిన మాలాబీ(75) వయోభారంతో శుక్రవారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ నిర్మలమ్మ వైఎస్సార్ బీమా కింద రూ.10 వేల తక్షణ సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పథకాలు వినియోగించుకోవాలి

నందికొట్కూరు రూరల్: సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ షేక్షావలి, ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఆత్మ భవన్‌లో అధికారులు మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం శనగ విత్తనాలను సబ్సిడీపై అందజేస్తుందన్నారు. కావాల్సిన రైతులు రైతుభరోసా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. సమావేశంలో ఏఈఏ విజయశేఖర్, రైతులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డుకు భూమిపూజ



భూమి పూజ చేస్తున్న ఎంపీపీ

జూపాడుబంగ్లా: మండలంలోని 80 బన్నూరు గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ సువర్ణమ్మ శుక్రవారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.7.05 లక్షల మండల పరిషత్ నిధులతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నూనెపల్లి ఎల్లారెడ్డి, లాయర్ సత్యనారాయణరెడ్డి, సాంబశివుడు, రాజేష్, అంజి, శ్రీను, బాలు, లక్ష్మన్, వడ్డెశంకర్, శ్రీను, వెంకటేష్, రాజు పాల్గొన్నారు.

వంట సామగ్రి పంపిణీ



సామగ్రి అందజేస్తున్న సర్పంచు

నందికొట్కూరు: పాములపాడు మండల కేంద్రంలోని ఆదర్శ, ఎంపీయూపీ ఉర్దూ, మిట్టకందాల జిల్లా పాఠశాలలకు ప్రభుత్వం మంజూరు చేసిన వంట సామగ్రిని ప్రజాప్రతినిధులు శుక్రవారం వంట నిర్వాహకులకు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచు మేకల భాగ్యమ్మ, పేరెంట్స్ కమిటీల చైర్‌పర్సన్లు శ్రీనివాసులు, షేక్షావలి, లలితమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవాలి

పగిడ్యాల: విద్యార్థులు చదువుతో పాటు సృజనాత్మకతను పెంపొందించుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వ్యవస్థాపక మనస్తత్వం అభివృద్ధి కార్యక్రమం(ఏపీఈఎండీపీ) జిల్లా మేనేజర్ పి.గోపాల్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని పడమర ప్రాతకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్వీయ అవగాహనపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హెచ్‌ఎం సువర్ణ, ప్రోగ్రామ్ డీఎస్‌ఓ సుందర్, ఫెసిలిటేటర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి

పగిడ్యాల: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని మండల విద్యాధికారి సుభాన్ ఉపాధ్యాయులకు ఆదేశించారు. శుక్రవారం మండలంలోని కొత్త పాలమర్రి ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. అనంతరం మూడవ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంఈఓ-2 మురళీమోహన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు గ్రేస్‌వినీల ఉన్నారు.

దొంగల కోసం గాలింపు

మహానంది: మహానంది నుంచి గాజులపల్లె వెళ్లే మార్గంలో చోరీలకు పాల్పడుతున్న దొంగల కోసం మహానంది పోలీసులు గాలింపు కొనసాగిస్తున్నారు. మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్, సిబ్బంది నల్లమలలోని ఉసిరిక ప్లాంట్లు, ఫారం గ్రామం, తెలుగుగంగ కాల్వ ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి గాలింపు చర్యలు చేపట్టారు.

ప్రజారోగ్యమే జగనన్న ధ్యేయం

● నందికొట్కూర్ ఎమ్మెల్యే ఆర్థర్



చికిత్స పొందిన వారికి అందజేస్తున్న మందులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

జూపాడుబంగ్లా: ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం అందించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ తెలిపారు. మండల కేంద్రంలోని 2వ సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ పథకంలో 2,500 వ్యాధులను చేర్చారన్నారు. ఆరోగ్యశ్రీలోకి రాని వ్యాధుల బారిన పడిన వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో హెల్త్‌క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాలతో వైద్యాన్ని పేదల చెంతకు చేర్చిన ఘనత జగనన్నదేనన్నారు. ఆరోగ్య సిబ్బందిని ఇంటింటికి పంపి వ్యాధిగ్రస్తులను గుర్తించి వైద్య విబిరాలకు తెచ్చి స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్యం చేయించే కార్యక్రమం దేశంలో ఎక్కడా లేదన్నారు. ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. అనంతరం వివిధ స్టాళ్లను పరిశీలించారు. జిల్లా అదనపు వైద్యాధికారిణి శారద ఆధ్వర్యంలో వైద్యులు గంగాధర్, మౌనిక తదితరులు దాదాపు 650 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలు అందజేశారు. మెరుగైన చికిత్సల నిమిత్తం మరికొందరిని కర్నూలుకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్యాధికారిణి శారద, సర్పంచ్ మొట్టె బాలయ్య, ఎంపీటీసీ కృపాకర్, జేసీఎస్ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు దిలీప్‌రాజు, శివానందరెడ్డి, దేవసహాయం, వంగల కృష్ణారెడ్డి, జంగాల పెద్దన్న, జంగాల మహేష్, తహసీల్దార్ పుల్లయ్య యాదవ్, ఎంపీడీఓ నూర్జహాన్, ఈఓపీఆర్డీ మధుమోహనచక్రవర్తి, జిల్లా జాయింట్ సెక్రటరీ తిరుమలేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ ఆరోగ్య భద్రత

నందికొట్కూరు రూరల్: ప్రతి కుటుంబానికీ ప్రభుత్వం ఆరోగ్య భద్రత కల్పిస్తోందని వైస్ ఎంపీపీ మంజుల అన్నారు. అల్లూరు గ్రామ సచివాలయం పరిధిలో శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆమె మాట్లాడారు. అనంతరం వైద్యులు మనోజ్ ఆధ్వర్యంలో పలువురికి వైద్య సేవలు అందజేసి ఉచితంగా మందులు అందజేశారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని గుర్తించి ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజశేఖర్ బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రవీంద్రనాయుడు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు పేదలకు వరం

● డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కాంతారావు నాయక్

నందికొట్కూరు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పేదలకు వరమని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కాంతారావు నాయక్ అన్నారు. శుక్రవారం పాములపాడు మండల పరిధిలోని బానకచర్ల గ్రామంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వై్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. డాక్టర్ గులాబ్షా, వినోద్‌కుమార్, స్పెషలిస్ట్ డాక్టర్లు నవ్య, వర్షితల నుంచి ఓపీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు.కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మల్లికార్జున,టీబీ సూపర్‌వైజర్ రవికుమార్,సూపర్‌వైజర్ ఆనందమ్మ, సీహెచ్‌ఓ అన్నమ్మ పాల్గొన్నారు.

ప్రజల వద్దకే స్పెషలిస్ట్ డాక్టర్లు

వెలుగోడు: ప్రజల వద్దకే స్పెషలిస్ట్ డాక్టర్లు వచ్చి వైద్యసేవలందించడం గతంలో ఎప్పుడూ లేదని ఎంపీపీ లాలం రమేష్ అన్నారు. బోయరేవుల గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. స్పెషలిస్ట్ డాక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైద్యసేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో డాక్టర్లు వేణుగోపాల్, సాయిప్రదీప్, వంశీకృష్ణ, లక్ష్మి ప్రసన్న, సలిమున్నీసా పాల్గొని దాదాపు 528 మందికి వైద్య చికిత్సలు నిర్వహించి, ఉచితంగా మందులను అందజేశారు. 14 మందిని మెరుగైన వైద్య సేవల నిమిత్తం ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు రెఫరల్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ముంతల విజయభాస్కర్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటరమణ, ఎంపీడీఓ షేక్ అమానుల్లా, అయ్యవారిపల్లె శేఖర్ పాల్గొన్నారు.

శ్రీశైలంలో..

శ్రీశైలం ప్రాజెక్ట్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు ఎ.బొజ్జిరెడ్డి, పి.జాన్సీరాణి, ఎ.విజయ్‌భార్గవ్, జె.స్రవంతి, టి.బి.సూపర్‌వైజర్ కె.పి.మస్తానయ్య, ఆప్తమాలజీ అసిస్టెంట్ గోవిందరాజులు పాల్గొని పలువురికి వైద్య సేవలు అందజేశారు. ఏడుగురిని మెరుగైన వైద్యం కోసం ఇతర వైద్యశాలలకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.మోహన్‌కుమార్, తహసీల్దార్ రాజేంద్రసింగ్, పంచాయితీ కార్యదర్శి, డీడీఓ బాలూనాయక్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వట్టే వెంకటరెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఎ.రజాక్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి, మండల అధ్యక్షులు జింకా గుండయ్య యాదవ్, మండల నాయకులు భరత్‌రెడ్డి, ఆసాది ప్రవీణ్ దివ్యతేజ, గౌస్‌మోహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.









అల్లూరులో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు, బానకచర్ల వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డిప్యూటి డీఎంహెచ్ఓ కాంతారావు నాయక్ , ఓపీ కోసం బారులు తీరిన జూపాడుబంగ్లా గ్రామస్తులు

వైద్య శిబిరాన్నిప్రారంభిస్తున్న ఎంపీపీ లాలంరమేష్

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు

నందికొట్కూరు: దసరా పండుగ ఉత్సవాలకు ఏర్పాట్లు చేయనునట్లు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణ సమీపంలోని ఆత్మకూరు రోడ్డుకు జమ్మిచెట్టు(శమీ వృక్షం) వద్ద దసరా పండుగ ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసేందుకు మున్సిపల్ చైర్మన్, కమిషనర్ కిషోర్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా పండుగ రోజు భక్తులు పెద్ద సంఖ్యలో జమ్మికి తరలివస్తారన్నారు.కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారి కావడంతో భక్తులకు, వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ రసూల్, దసరా ఉత్సవ కమిటీ సభ్యులు రాజు, శ్రీధర్, శ్రీకాంత్, రంగారెడ్డి, శివప్రసాద్, శ్రీకాంత్‌గౌడు, వెంకటేశ్వరెడ్డి, ఆర్ట్ శ్రీను, రంగస్వామి పాల్గొన్నారు.



వివిధ వేషధారణల్లో చిన్నారులు

దసరా ముందస్తు సంబరాలు

పట్టణంలోని స్కాలర్ స్కూల్‌లో దసరా ముందస్తు సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వివిధ వేషధారణతో అలరించిన చిన్నారులను మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కమిషనర్ కిషోర్, పాఠశాల యాజమాన్యం లక్ష్మి, శివప్రసాద్, నంది కళాశాల కరస్పాండెంట్ శ్రీకాంత్, వైఎస్సార్‌సీపీ నాయకులు విజ్జి అభినందించారు.

దసరా మహోత్సవాలకు ఆహ్వానం





కలెక్టర్ మనజీర్ జిలాని శామూన్, ఎస్పీ రఘువీర్‌రెడ్డిలకు ఆహ్వాన పత్రికలు అందజేస్తున్న ఈఓ డి.పెద్దిరాజు

శ్రీశైలంటెంపుల్: ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు శ్రీశైలంలో జరుగుతున్న దసరా మహోత్సవాలకు హాజరుకావాలని శుక్రవారం నంద్యాలలో పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డిని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎస్పీ రఘువీర్‌రెడ్డిని, జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. అలాగే రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని దేవస్థాన పర్యవేక్షకులు మధుసూదన్‌రెడ్డి కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

మహానంది సన్నిధిలో ప్రముఖులు

మహానంది: మహానంది క్షేత్రంలోని కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. శ్రీశైలం ఈఓ పెద్దిరాజు, ఆదోని జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ రమణారెడ్డి దంపతులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ వేర్వేరుగా స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. స్వామి దర్శనానంతరం ప్రముఖులకు యాగశాలలో స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.



జడ్జి రమణారెడ్డికి ఆశీర్వచనాలు ఇస్తున్న అర్చకులు

ఉపాధి పనులు పకడ్బందీగా నిర్వహించాలి



రికార్డులు పరిశీలిస్తున్న పీడీ, అధికారులు

● డ్వామా పీడీ రామచంద్రారెడ్డి

మహానంది: ఉపాధి పనులు పకడ్బందీగా చేపట్టాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ రామచంద్రారెడ్డి తెలిపారు. బుక్కాపురంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయం ఆవరణలో శుక్రవారం 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో జరిగిన రూ. 5,37,66,347 విలువైన పనులకు సంబంధించి పరిశీలనలు చేసి రూ.2,065 రికవరీకి ప్రతిపాదించారు. కార్యక్రమంలో ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి, సర్పంచ్ కందుల వరలక్ష్మమ్మ, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, ఏపీడీ బాలాజీ, ఎంపీడీఓ శివనాగజ్యోతి, ఏపీఓ మనోహర్, ఏఈలు రాముడు, వాసుదేవుడు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే 'గడప గడప' ఉద్దేశం

● నందికొట్కూర్ ఎమ్మెల్యే ఆర్థర్



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

పగిడ్యాల: గ్రామాల అభివృద్ధే గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమ ఉద్దేశమని నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నెహ్రూనగర్ సచివాలయం 1 పరిధిలోని పీకే ప్రాగటూరు గ్రామంలో మూడో రోజు శుక్రవారం పర్యటించారు. ఇంటింటికి తిరిగి పథకాలు అందుతున్నాయా, లేదా అని ఆరా తీశారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించి సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మెయిన్ రోడ్డు వెంట ఉండే కల్వర్టుల ఎత్తు తక్కువగా ఉన్నందున పంట కాలువల ద్వారా నీరు ఇళ్లలోకి వస్తుందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎస్సీ కాలనీ నుంచి ప్రాథమిక పాఠశాల వరకు సీసీ రోడ్డు వేయాలని, కమ్యూనిటీ భవనం ఏర్పాటు చేయలని కాలనీవాసులు కోరగా స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులను పిలిచి వాటిని నోట్ చేసుకోవాల్సిందిగా ఆదేశించారు. కేసీ కాలువ కింద వేసిన పంటలను కాపాడేందుకు నీటి లభ్యత ఉన్నంత వరకు నీటి సరఫరాను కొనసాగిస్తామని, పొదుపుగా వాడుకోవాలని రైతులు అడిగిన ప్రశ్నకు ఎమ్మెల్యే సమాధానం చెప్పారు. వరి జోలికి వెళ్లకుండా ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేసి పిల్లల సామర్థ్యాలను పరీక్షించారు. వారు చెప్పిన సమాధానాలకు సంతృప్తి చెందారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ భారతీ, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, ఏఓ విజయ్‌జ్యోతుకుమార్, ఎంఈఓ సుభాన్, ఏఈలు వెంకటేశ్వర్లు, శివకుమార్, క్రాంతికుమార్, అశోక్, పంచాయతీ కార్యదర్శి వీరన్న యాదవ్, వీఆర్వో వెంకటస్వామి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు సగినేల రమణ, హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రమాదేవి, నాయకులు సాయివిజయ, శ్రీనాథ్‌రెడ్డి, విక్టర్, రిటైర్డ్ ఎస్ఐ జాన్ పాల్గొన్నారు.

పంట కాలువలో గుర్తు తెలియని శవం లభ్యం

పగిడ్యాల: ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని బీరవోలు సమీపాన పంట కాలువలో గుర్తు తెలియని మృతదేహాన్ని శుక్రవారం స్థానికులు గుర్తించారు. స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ వేణుగోపాల్, కానిస్టేబుళ్లు రఫీ, అమర్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుని శరీరం పూర్తిగా కుళ్లిపోయి గుర్తు పట్టలేనంతగా తయారైంది. బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్, నల్ల బెల్టు ఆనవాలు తప్ప ఏమి లేవు. మృతుడి వయస్సు 30 నుంచి 40 ఏళ్ల మధ్యలో ఉంటుంది. వీఆర్వో ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, పోస్ట్‌మార్టం అనంతరం పంట కాలువ వద్దే అంత్యక్రియలు నిర్వహించారు.

ఇద్దరిపై కేసు నమోదు

కొత్తపల్లి: చిన్న విషయానికి ఘర్షణ పడిన ఘటనలో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హుస్సేన్ బాషా శుక్రవారం తెలిపారు. మండలంలోని ముసలిమడుగు గ్రామానికి చెందిన నజీర్ అహమ్మద్ ఈనెల 10న రాత్రి అన్నం తిని, ప్లేట్‌లోని నీళ్లను ఇంట్లో నుంచి బయటకు చల్లగా అదే సమయంలో రోడ్డుపై వెళ్తున్న అనూస్‌పై పడ్డాయి. ఈ విషయంలో అనూస్, అతని సోదరుడు జుబేర్ కలిసి నజీర్ అహమ్మద్‌పై దాడి చేశారు. నజీర్ ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మల్లన్న సేవలో దేవదాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దేవదాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.కరికాల్ వళవన్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. శుక్రవారం వేకువజామున ఆలయం వద్ద ఆయనకు దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆశీర్వచన మండపంలో అధికారులు ఆయనకు స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

ఆకతాయికి జైలుశిక్ష

నంద్యాల(వ్యవసాయం): మహానందికి చెందిన ఆకతాయికి ఐదు రోజులు జైల్ శిక్ష విధిస్తూ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి శుక్రవారం తీర్పు చెప్పారని పోలీసు సిబ్బంది తెలిపారు. మహానంది దేవస్థానం ఆవరణంలో మహిళా భక్తుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని రేగటి వెంకటేశ్వరరెడ్డిపై స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసి అతడిని సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా విచారణ అనంతరం జైలు శిక్ష ఖరారు చేసినట్లు పోలీసులు తెలిపారు.



దసరా ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

మహానంది: ఈ నెల 15వ తేదీ నుంచి 23 వ తేదీ వరకు మహానంది ఆలయంలో జరిగే దసరా ఉత్సవాలకు హాజరు కావాలని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మహానంది ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, వేదపండితులు రవిశంకర అవధాని కోరారు.

సంక్షేమ సారథికి మళ్లీ పట్టం కట్టాలి



మాట్లాడుతున్న శిల్పా భువనేశ్వరరెడ్డి

మహానంది: సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ పట్టం కట్టాలని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ సీనియర్ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి అన్నారు. బండిఆత్మకూరు మండలం పార్నపల్లెలోని టీటీడీ కల్యాణ మండపంలో శుక్రవారం జరిగిన జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా పాలన సాగిస్తున్న విషయాన్ని ప్రజలకు వివరించి మరోసారి జగన్ ఏపీకి అవసరమని అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బారెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, వ్యవసాయ సలహామండలి చైర్మన్ కృష్ణమల్లారెడ్డి, వైస్ ఎంపీపీ రాగాల వెంకటరమణ, జేసీఎస్ ఇన్‌చార్జ్ ముడిమెల పుల్లారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మద్దిలేటి, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ విక్రమసింహనాయక్ పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న ఎంపీ గోరంట్ల మాధవ్



ఎంపీ దంపతులకు సత్కరిస్తున్న అర్చకులు, అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను హిందూపురం పార్లమెంట్ సభ్యులు గోరంట్ల మాధవ్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. శుక్రవారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన ఎంపి దంపతులకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆశీర్వచన మండపంలో ఎంపీ దంపతులకు ఆలయ అధికారులు స్వామివారి శేషవస్త్రాన్ని, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను అందించి సత్కరించారు.

బెల్టు దుకాణం నిర్వాహకుడి అరెస్టు



జూపాడుబంగ్లా: మండలంలోని చాబోలు గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టుదుకాణంపై ఎస్ఐ మారుతిశంకర్ శుక్రవారం తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రామకృష్ణ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని నుంచి 130 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.